వేధిస్తే.. ఊచలు లెక్కిస్తారు

వేధింపులకు పాల్పడిన వారికి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న రాచకొండ పోలీసు కమిషనర్ తరుణ్‌జోషి

● రాచకొండ పోలీసు కమిషనర్ తరుణ్ జోషి

సిటీబ్యూరో, మార్చి 16 (నమస్తే తెలంగాణ): మహిళలు, బాలికలను వేధింపులకు గురిచేస్తే కఠిన చర్యలు తప్పవని రాచకొండ పోలీసు కమిషనర్ తరుణ్‌జోషి హెచ్చరించారు. మహిళల భద్రత కోసం రాచకొండ పరిధిలో షీటీమ్ బృందాలు నిరంతరాయంగా పనిచేస్తున్నాయని, వేధింపులు ఎదుర్కొనే బాధిత మహిళలు, యువతులు, బాలికలు నిర్భయంగా షీటీమ్‌కు ఫిర్యాదు చేయవచ్చని సీపీ సూచించారు. వేధింపులకు గురిచేసే ఆకతాయిలకు శనివారం ఎల్బీనగర్‌లోని రాచకొండ సీపీ క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన కౌన్సెలింగ్‌లో సీపీ మాట్లాడుతూ.. కమిషనరేట్ పరిధిలోని బస్టాండ్‌లు, రైల్వేస్టేషన్లు, మెట్రో స్టేషన్లు, స్కూళ్లు, కాలేజీలు, మార్కెట్లు తదితర ప్రాంతాల్లో షీటీమ్ బృందాలు మఫ్టీలో విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. డెకాయ్ ఆపరేషన్‌లో భాగంగా.. మహిళలు, బాలికలను వెంబడించి, వేధించే పోకిరీలను పూర్తి ఆధారాలతో సహా పట్టుకుని న్యాయస్థానంలో హాజరుపర్చడంతో పాటు వారి కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇస్తున్నట్లు సీపీ తెలిపారు. ఈ క్రమంలోనే గత నెల 1 నుంచి 15వతేదీ వరకు 120మంది ఆకతాయిలను పట్టుకుని వారి కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇప్పించినట్లు తెలిపారు. గత 15 రోజుల్లో 135 ఫిర్యాదులు అందగా, వాటిలో ప్రేమ పేరుతో తోటి ఉద్యోగినిని వేధిస్తున్న వ్యక్తిని, సొంత వదిననే వేధిస్తున్న మరిదిని సైతం అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు.

జాతీయ లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కారం

చర్లపల్లి, మార్చి 16: మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో జిల్లా వ్యాప్తంగా 21బెంచిల్లో 1922 క్రిమినల్ కేసులు పరిష్కరించారు. శనివారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి బీఆర్ మధుసూదన్‌రావు లోక్ అదాలత్‌ను ప్రారంభించారు. 22 సివిల్, 54 ప్రీ లిటిగేషన్ కేసులను పరిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. కక్షిదారుల కేసుల సత్వర పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన జాతీయ లోక్ అదాలత్‌కు మంచి స్పందన వచ్చిందని చెప్పారు. రూ.71లక్షల 97వేల 525లను పరిహారం కింద చెల్లించామని పేర్కొన్నారు. ఒకటవ అదనపు జిల్లా న్యాయమూర్తి రఘునాథ్‌రెడ్డి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కిరణ్‌కుమార్, మల్కాజిగిరి డీసీపీ పద్మజ సమక్షంలో లోక్ అదాలత్ నిర్వహించారు. జిల్లా న్యాయ మూర్తులు, మల్కాజిగిరి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోట రామచంద్రారెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.

1,02,556 కేసుల పరిష్కారం

నాంపల్లి కోర్టులు, మార్చి 16 (నమస్తే తెలంగాణ) : నాంపల్లి కోర్టుల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం జరిగిన జాతీయ లోక్‌అదాలత్‌లో 1,02,556 కేసులను పరిష్కరించినట్లు న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి చంద్ర శేఖర్‌రావు వెల్లడించారు. నాంపల్లి, సికింద్రాబాద్, మనోరంజన్ ప్రాంగణంలో మొత్తం 30 బెంచ్‌లను ఏర్పాటు చేశారు. అలాగే 36,38,380 ట్రాఫిక్ చాలాన్ కేసులను తొలగించారు. రాజీ చేసుకునే వీలున్న ఐపీసీ సెక్షన్ల కింద నమోదైన కేసులు, ఎక్సైజ్, వివాహసంబంధ, చెక్ బౌన్స్ కేసులను పరిష్కరించారు. నాంపల్లి కోర్టులోని సమావేశ మందిరంలో ఉదయం ఏర్పాటు చేసిన ప్రారంభోత్సవ కార్యక్రమానికి న్యాయసేవాధికార సంస్థ వైస్‌పర్సన్ ఎస్.ప్రేమావతి, జిల్లాజడ్జీ సాయిభూపతి, అన్ని కోర్టులకు చెందిన మెజిస్ట్రేట్లు, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఎన్.శ్వేత, ఏసీపీ కె.భద్రయ్య, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ మురళీమనోహర్

కుల గణన ద్వారానే సామాజిక న్యాయం

ఖైరతాబాద్, మార్చి 16: కుల గణన ద్వారా అన్నివర్గాలకు సామాజిక న్యాయం జరుగుతుందని పీపుల్స్ కమిటీ ఆన్ క్యాస్ట్స్ సెన్సస్ ప్రతినిధి ప్రొఫెసర్ మురళీమనోహర్ తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సమగ్ర కుల గణన వల్ల సామాజిక, విద్య, సాంస్కృతి, ఉద్యోగ, సంపద, రాజకీయం, వృత్తిపర మైన సమాచారం లభిస్తుందన్నారు. సమాచారం ఆధారంగానే సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల రూపకల్పన సాధ్యమన్నారు. దీంతో వెనుకబడిన కులాల గుర్తింపు, రిజర్వేషన్లు నిజమైన లబ్ధిదారులకు అందుతాయన్నారు. ప్రస్తుత ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి జీవో తెచ్చిందని, దానిని వెంటనే అమల్లోకి తీసుకురావాలన్నారు. ఇందుకు బీసీకమిషన్, నిపుణులతో కూడిన కమిటీని ఏర్పాటు చేసి, వారి పర్యవేక్షణలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అమలు చేయాలన్నారు. సమావేశంలో ప్రొఫెసర్ దేవళ్ల సమ్మయ్య, ప్రొఫెసర్ తిరుమలి, ప్రొఫెసర్ పి.నరేంద్రబాబు, డాక్టర్ పృథ్వి రాజ్ తదితరులు పాల్గొన్నారు.

అపోలో 'టుగెదర్ ఫర్ హర్'

జూబ్లీహిల్స్, మార్చి 16: మహిళలకు క్యాన్సర్‌పై అవగాహన కల్పించేందుకు 'టుగెదర్ ఫర్ హర్' క్యాంపెయిన్‌ను రూపొందించామని అపోలో వైద్య సంస్థ ప్రకటించింది. శనివారం తాజ్ డెక్కన్ హోటల్‌లో ఏర్పాటుచేసిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో తెలంగాణ రాష్ట్ర వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి క్రిస్టినా జడ్ చొంగ్తూ, తెలంగాణ గ్రేహౌండ్స్ అండ్ ఆక్టోపస్ అడిషనల్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (ఆపరేషన్స్) డాక్టర్ విజయ్‌కుమార్‌తో కలిసి 'పర్పుల్ క్లిప్ చాంపియన్స్ బ్రిగేడ్'ను ప్రారంభించారు. క్రిస్టినా జడ్ చొంగ్తూ మాట్లాడుతూ.. మహిళలు క్యాన్సర్ పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. మహిళలకు మనోధైర్యం కల్పిస్తూ క్యాన్సర్‌ను ధీటుగా ఎదుర్కొనేందుకు నగరంలోని 20 కళాశాలలు, న్యాయవాదులతో దేశంలోనే తొలిసారి కార్యక్రమాన్ని చేపట్టామని వెల్లడించారు. నాణ్యమైన ఆరోగ్య సంరక్షణ పొందడం ప్రతి మహిళ హక్కు అని, క్యాన్సర్ నివారణకు అవసరమైన సేవలు, వనరులను అందుబాటులో ఉంచే లక్ష్యంతో చేపట్టిన కార్యక్రమానికి ప్రభుత్వం పూర్తి మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చబ్ సంస్థ హెచ్‌ఆర్ స్వప్న సారిపల్లి, ఇండియన్ క్లాసికల్ డ్యాన్సర్, కొరియోగ్రాఫర్ అండ్ స్కాలర్ ఆనందశంకర్‌జయంత్, అపోలో గైనిక్ అంకాలజిస్ట్ డాక్టర్ సాయిడయానా, సర్జికల్ బ్రెస్ట్ అంకాలజిస్ట్ డాక్టర్ ప్రతిమ కనుమూరి, పి.విజయ్‌ఆనంద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కోర్సుల పరీక్ష ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, మార్చి 16: ఉస్మానియా వర్సిటీ పరిధిలోని అన్ని డిగ్రీ కోర్సుల పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ, బీఎస్‌డబ్ల్యూ తదితర కోర్సుల రెండు, నాలుగు, ఆరో సెమిస్టర్ రెగ్యులర్‌తోపాటు అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ ఫీజును వచ్చే నెల 3లోగా సంబంధిత కళాశాలలో చెల్లించాలని చెప్పారు. రూ.500 అపరాధ రుసుముతో 15వ తేదీలోగా చెల్లించవచ్చన్నారు. ఈ పరీక్షలను మే నెలలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

టీ-సేవ కేంద్రాల ఏర్పాటుకు దరఖాస్తులు

కాచిగూడ, మార్చి 16: టీసేవ ఆన్‌లైన్ కేంద్రాలను ఏర్పాటు చేసుకోవడానికి తెలంగాణ వ్యాప్తంగా ఆన్‌లైన్ దరఖాస్తులను కోరుతున్నట్లు టీసేవ సంస్థ డైరెక్టర్ అడపా వెంకట్ రెడ్డి తెలిపారు. శనివారం కాచిగూడలో విలేకరులతో మాట్లాడుతూ టీ-సేవ బ్యాంకు మిత్ర ద్వారా డెబిట్‌కార్డ్స్, లైఫ్‌టర్మ్ ఇన్సూరెన్స్ చెల్లింపులు, బస్సు, రైలు, విమానాల టికెట్స్ బుకింగ్, కొత్త పాన్‌కార్డులు, టెలికాం పోస్ట్‌పెయిడ్, ప్రీపెయిడ్, ఆల్ బ్యాంక్స్ మనీ ట్రాన్స్‌ఫర్లు, ఆధార్ పేమెంట్ సిస్టం, మైక్రో ఏటీఎం సేవలు అందించనున్నట్లు పేర్కొన్నారు. ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, ఇంజినీరింగ్ అర్హత గల యువత 31పు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొవచ్చని కోరారు. వివరాలకు 81799 55744,www.tsevacentre.comలో సంప్రదించవచ్చని కోరారు.

రాముడితో పాటు జాంబవంతుడి విగ్రహం పెట్టాలి

హిమాయత్‌నగర్, మార్చి 16: అయోధ్యలో రాముడితో పాటు జాంబవంతుడి విగ్రహం పెట్టాలని మాదిగ రాజ్యాధికార పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు తిమ్మన నవీన్‌రాజ్ డిమాండ్ చేశారు. శనివారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్రంతోపాటు, యూపీ ప్రభుత్వం ఈ అంశంపై చొరవతీసుకోవాలని అన్నారు. జాంబవంతుడి చరిత్రను ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు కృషిచేయాలని చెప్పారు. దీంతోపాటు ఏపీలోని నెల్లూరులో 1100 ఏండ్ల పురాతన ఆలయాన్ని అభివృద్ధి చేయాలన్నారు. తెలంగాణలో రెండెకరాల స్థలంలో జాంబవంతుని ఆలయాన్ని ఏర్పాటు చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ ఉపాధ్యక్షుడు కోటేశ్వరరావు, కార్యనిర్వాహక అధ్యక్షుడు నర్సింహ, నగర అధ్యక్షుడు ప్రవీణ్ జయరాంరాజ్, నాయకులు ఎల్లేశ్, జగదీశ్‌రావు పాల్గొన్నారు.

సివిల్స్‌కు ఉచిత కోచింగ్

మేడ్చల్ కలెక్టరేట్, మార్చి 16: యూపీఎస్సీ (సివిల్ సర్వీసెస్)-2025 పరీక్ష కోసం 2024-2025 విద్యా సంవత్సరంలో మైనార్టీ అభ్యర్థులకు ఉచిత కోచింగ్‌ను నిర్వహిస్తుందని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా మైనార్టీస్ సంక్షేమ శాఖ అధికారి కె.వీణ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర మైనార్టీ స్టడీ సర్కిల్‌లో ప్రవేశం పొందే అభ్యర్థులందరూ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. యూపీఎస్సీ (CSAT-2024) యొక్క సివిల్ సర్వీసెస్ ఆప్టిట్యూడ్ టెస్ట్‌లో ప్రవేశం కోసం అన్ని జిల్లాల్లోని సాధారణ, ప్రొఫెషనల్ డిగ్రీ పూర్తి చేసిన మైనార్టీ అభ్యర్థులు ఈనెల 15వ తేదీ నుంచి ఆన్‌లైన్ WWW.TMREISTELANGANA.CGG.GOV.IN వైబ్ సైట్ ద్వారా ఏప్రిల్ 12లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏప్రిల్ 28న ఆదివారం ప్రవేశ పరీక్ష అన్ని జిల్లా కేంద్రాలలోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలలో నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. ఇతర వివరాలకు ఫోన్ 040-23236112 అన్ని పని దినాలలో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సంప్రదించాలని సూచించారు.

విద్యుత్ మరమ్మతులపై ఎక్స్‌లో అప్‌డేట్

● ట్విట్టర్ వేదికగా వచ్చే ఫిర్యాదులకు వెంటనే స్పందన

సిటీబ్యూరో, మార్చి 16 (నమస్తే తెలంగాణ): విద్యుత్ వినియోగదారుల నుంచి వచ్చే ఫిర్యాదులకు సత్వరమే స్పందించేందుకు సోషల్ మీడియాను విద్యుత్ శాఖ అధికారులు ప్రధాన మాధ్యమంగా వాడుకుంటున్నారు. సమస్యలపై క్షేత్రస్థాయిలో అధికారులు, సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండి పని చేసేలా దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీఎస్ఎస్పీడీసీఎల్) సీఎండీ ముషారఫ్ ఫరూఖీ చర్యలు చేపట్టారు. ప్రతిరోజు వచ్చే ఫిర్యాదులపైనా ఉన్నతాధికారులో చర్చిస్తున్నారు. నగరవాసులు సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండటం ఇందుకు ఓ కారణం. ఇప్పటికే టీఎస్ఎస్పీడీసీఎల్ (TSSPDCL@TsspdclCorporat) పేరుతో ట్విట్టర్ హ్యాండిల్ కలిగిఉంది. అయితే గ్రేటర్ పరిధిలోని 9 సర్కిళ్లలో కొన్ని ప్రత్యేకంగా ట్విట్టర్ హ్యాండిల్స్ (@se_op_cybercity, @se_op_rjnr) కలిగి ఉండగా.. ఇదే తరహాలో డిస్కం పరిధిలోని సర్కిల్స్ సైతం ట్విట్టర్ హ్యాండిల్‌ను ఏర్పాటు చేసుకొని ఫిర్యాదులను సర్కిళ్ల అధికారులు గుర్తించి, పరిష్కరించి అప్‌డేట్ చేయాలని ఉన్నతాధికారులు సూచించారు. దీంతో సంస్థ పనితీరుపై వినియోగదారుల్లో నమ్మకం పెరుగుతుందని అన్నారు. డిమాండుకు అనుగుణంగా సరఫరాకు సరిపడా విద్యుత్ అందుబాటులో ఉన్న నేపథ్యంలో అంతరాయం లేకుండా కరెంట్ అందించవచ్చని సమీక్షల్లో ఉన్నతాధికారులు సూచిస్తున్నారు.

సదస్సును ప్రారంభిస్తున్న ప్రముఖ నటి లక్ష్మి మంచు, సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్, ప్రముఖులు

ఆటిజంపై అవగాహన పెంపొందించాలి

శేరిలింగంపల్లి, మార్చి 16: ఆటిజం రుగ్మతపై సమాజంలో అవగాహన పెంపొందించాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. మర్వం రెసోనేటింగ్ రెసిలెన్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'ఆటిజం ఆరా' అవగాహన, చైతన్య కార్యక్రమం గచ్చిబౌలి బ్రహ్మకుమారీస్ శాంతిసరోవర్ గ్లోబల్ పీస్ ఆడిటోరియంలో శనివారం నిర్వహించారు. ప్రముఖ గైనకాలజిస్టు డాక్టర్ నబత్ లఖానీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ప్రముఖ నటి, సినీ నిర్మాత లక్ష్మి మంచు, సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. వారు మాట్లాడుతూ.. ఆటిజం రుగ్మతపై అవగాహన పెంపొందించడంతో పాటు బాధితులకు సేవలందించేందుకు మర్వం రెసోనేటింగ్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో తెలంగాణ సోషల్ ఇంపాక్ట్ గ్రూప్ డైరక్టర్ తరుణ్, ప్రముఖులు కామిని సరాఫ్, మంజు కళానిధి, అర్చనసురేశ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ విశేషంగా ఆకట్టుకున్నాయి.

కళలకు నిలయంగా..

● ఆకట్టుకున్న 'ఆర్టిక్స్' ఆర్ట్ ఫెయిర్

ఆర్ట్ ఫెయిర్‌ను ప్రారంభిస్తున్న పింకీరెడ్డి

కొలువుదీరిన కళాకృతులు

ఖైరతాబాద్, మార్చి 16: వందలాది చిత్ర కళలు.. విభిన్నమైన కళాకృతులు కొలువుదీరాయి. సోమాజిగూడలోని ది పార్క్ హోటల్ వేదికగా, 'ఆర్టిక్స్' పేరుతో ఏర్పాటు చేసిన ఆర్ట్ ఫెయిర్ ఆకట్టుకున్నది. ప్రముఖ పారిశ్రామిక వేత్త పింకీరెడ్డి, ఆర్టిస్ట్ రవీందర్‌రెడ్డి, ఆర్టిక్స్ వ్యవస్థాపకులు మాళవిక పొద్దార్, షైనా, సేతు వైద్యనాథన్, పాయల్‌కపూర్‌తో కలిసి ఫెయిర్‌ను ప్రారంభించారు. 9మంది సోలో, నలుగురు అంతర్జాతీయ, 75 మంది సంప్రదాయ ఆర్టిస్టులు ఇక్కడ ఏర్పాటు చేసిన 45గ్యాలరీల్లో తమ కళారూపాలను ప్రదర్శించారు.

యూకేలో వైద్యవృత్తికి అవకాశం

అవగాహన కల్పిస్తున్న డాక్టర్ మో సోబి

బంజారాహిల్స్, మార్చి 16: యునైటెడ్ కింగ్‌డమ్‌లో పీజీస్థాయి వైద్యవిద్యను అభ్యసించాలనుకునే విద్యార్థులకు, అక్కడే ప్రాక్టీస్ చేయాలనే వైద్యులకు పలు అంశాలపై అవగాహన నిర్వహించారు. శనివారం జూబ్లీహిల్స్‌లోని అపోలో మెడికల్ కళాశాలలో ప్రఖ్యాత ఉక్మాలా, ప్లాబ్ సంస్థ సీఈవో డాక్టర్ మో సోబి హాజరై మాట్లాడారు. ఇంగ్లండ్‌లో ప్రాక్టీస్ చేయడానికి అవసర మైన లైసెన్స్‌ను పొందాలంటే ఆంగ్ల పరీక్షతో ఉక్మాలా స్టెప్ 1, స్టెప్ 2 పరీక్షలు పూర్తిచేస్తే యూకే జనరల్ మెడికల్ కౌన్సిల్‌లో నమోదుకు అర్హత సాధిస్తారని చెప్పారు. ఇప్పటిదాకా 3500మంది వైద్యులకు తమ సంస్థ ద్వారా శిక్షణ ఇచ్చామని తెలిపారు.

ట్రాఫిక్ సేవల్లో ఐటీ, టెక్ మహీంద్రా ఉద్యోగులు

● సీపీఆర్‌లో శిక్షణ పూర్తిచేసుకున్న బృందాలు

జూబ్లీహిల్స్, మార్చి 16: పలు ఐటీ కంపెనీ ఉద్యోగులు ప్రమాదాలు చోటుచేసుకున్నప్పుడు సీపీఆర్, తదితర సేవలందించే ఆపద్బాంధవులుగా మారనున్నారు. ఎస్సీ ఎస్సీ, సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసుల సంయుక్తాధ్వర్యంలో శనివారం ఏఐజీ హాస్పటల్స్ సౌజన్యంతో నిర్వహించిన శిక్షణ కార్యక్రమాన్ని సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్ ప్రారంభించారు. సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా టెక్ మహీంద్రా ఉద్యోగులతో పాటు పలు ఐటీ కంపెనీల ఉద్యోగులు ట్రాఫిక్ వలంటీర్లుగా సేవలందించేందుకు ముందుకురావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎస్సీ జాయింట్ సెక్రటరీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గొండ్ల సంక్షేమం కోసం కృషి చేయాలి

మంత్రి పొన్నం ప్రభాకర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న పల్లె లక్ష్మణ్‌రావుగౌడ్, తదితరులు

హిమాయత్‌నగర్, మార్చి 16: రాష్ట్రంలోని గొండ్ల సంక్షేమం కోసం కృషి చేయాలని కోరుతూ శనివారం రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు తెలంగాణ గొండ సంఘం ప్రతినిధి బృందం వినతిపత్రాన్ని అందజేసింది. సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పల్లె లక్ష్మణ్‌రావుగౌడ్ మాట్లాడుతూ.. గీత కార్మికులు కల్లును గీసే క్రమంలో రక్షణ పరికరాలు లేకపోవడం వల్ల ప్రమాదాల బారినపడి మృతి చెందుతున్నారని అన్నారు. కార్మికులకు సేఫ్టీ కిట్లు అందేలా చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గ్రేటర్‌లో కొనసాగుతున్న కల్లు దుకాణాలపై పోలీసులు చేసే దాడులు ఆపాలని కోరారు. ప్రమాదవశాత్తు మరణించిన గీత కార్మికులకు ప్రమాద బీమా, ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని విన్న వించినట్లు తెలిపారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించి సమస్యలు పరిష్కారం అయ్యేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారని చెప్పారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, నాయకులు బి.దేవేందర్‌గౌడ్, రాములుగౌడ్, మహేందర్ గౌడ్, సురేశ్‌గౌడ్, భాస్కర్‌గౌడ్, సత్యనారాయణగౌడ్, ఆనంద్‌గౌడ్, విష్ణుగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, నీలంగౌడ్, కొండల్‌గౌడ్, వెంకటేశ్ గౌడ్ పాల్గొన్నారు.

శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులతో ప్రతినిధులు

ఐఐసీటీలో ముగిసిన స్కిల్ డెవలప్‌మెంట్ సెషన్

సిటీబ్యూరో, మార్చి 16 (నమస్తే తెలంగాణ): సీఎస్ఐఆర్ ఇంటిగ్రేటెడ్ స్కిల్ ఇనిషియేటివ్ కార్యక్రమంలో భాగంగా ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీలో నిర్వహించిన శిక్షణ తరగతులు ముగిసినట్లు నిర్వాహకులు వెల్లడించారు. బయో ఇన్ఫర్మేటిక్స్, కెమి ఇన్ఫర్మేటిక్స్ అంశంపై విద్యార్థులకు ప్రత్యేక శిక్షణనిచ్చారు. మార్చి 4న మొదలైన తరగతులు 12రోజులపాటు కొనసాగాయి. ట్రైనింగ్ సెషన్‌లో ఏపీకి చెందిన బీవీరాజు కాలేజీ విద్యార్థులు హాజరయ్యారు. విద్యార్థులను పరిశ్రమలకు అవసరాలను అనుగుణంగా తీర్చిదిద్దడంలో ఈ తరహా శిక్షణ తరగతులు ఎంతగానో సాయపడుతాయని, మంచి ఉద్యోగ, ఉపాధి అవకాశాలను పొందేందుకు వీలు పడుతుందని ఐఐసీటీ వర్గాలు పేర్కొన్నాయి.

మహిళలు రాణిస్తేనే దేశం అభివృద్ధి

కాచిగూడ, మార్చి 16: మహిళలు అన్నిరంగాల్లో రాణించినప్పుడే దేశం అభివృద్ధి పథంలో పయనిస్తుందని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ ఆధ్వర్యంలో శనివారం కాచిగూడ హోటల్‌లో వరల్డ్ ఉమెన్స్ డే నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఆర్.కృష్ణయ్య, హైకోర్టు మాజీ జస్టిస్ జి.చంద్రయ్య హాజరయ్యారు. వారు మాట్లాడుతూ.. మహిళా బిల్లులో బీసీలకు సబ్ కోటా కల్పిస్తేనే మహిళలకు రాజ్యాధికారం దక్కుతుందని అన్నారు. జాతీయ స్థాయిలో అన్నిరంగాల్లో సముచిత స్థానం ప్రభుత్వం కల్పించాలని కోరారు. దేశ వ్యాప్తంగా అణచివేతకు గురవుతున్న మహిళల్లో అధికంగా ఓబీసీ మహిళలే ఉన్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జి.విజయ్‌కుమార్, మట్ట జయంతిగౌడ్, డాక్టర్ కీర్తన, ప్రచేత్ పాటు అన్నపూర్ణ, టీపీసీసీ కోట్ల శ్రీనివాస్, రామకృష్ణ, రాజ్‌కుమార్, నంద గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో పాల్గొన్న ఆర్.కృష్ణయ్య, జస్టిస్ చంద్రయ్య తదితరులు

డాక్టర్ శోభారాజ్‌కు లైఫ్‌టైం అచీవ్‌మెంట్

రవీంద్రభారతి, మార్చి 16: సాధికారతతోనే మహిళలు అన్నిరంగాల్లో రాణిస్తారని టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్త అన్నారు. శ్రీసాయి అలేఖ్య సాంస్కృతిక సంఘ సేవ సంస్థ, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో వరల్డ్ వుమెన్స్ డే పురస్కరించుకొని పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ శోభారాజ్‌కు జీవిత సాఫల్య పురస్కారం, పలువురు మహిళలకు చాకలి ఐలమ్మ స్త్రీశక్తి పురస్కారాలను శనివారం రవీంద్రభారతిలో అందజేశారు. అతిథులుగా ఉప్పల శ్రీనివాస్, నీటి పారుదల కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ సముద్రాల వేణుగోపాలచారి, కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేశ్ హాజరయ్యారు. సంస్థ వ్యవస్థాపకురాలు ఉపద్రష్ట అరుణ అశోక్‌ను అభినందించారు.అనంతరం పలువురి మహిళలకు చాకలి ఐలమ్మ అవార్డులతో ఘనంగా సత్కరించారు.

శోభారాజ్‌కు జీవిత సాఫల్య పురస్కారాన్ని అందజేస్తున్న ఉప్పల శ్రీనివాస్, బండి రమేశ్, సముద్రాల వేణుగోపాలచారి

ఆయుర్వేద వైద్యంలో ఔషధ మొక్కలకు ప్రాధాన్యం

జూబ్లీహిల్స్, మార్చి 16: ఆయుర్వేద వైద్యంలో ఔషధ పరిజ్ఞానం.. మూలికా మొక్కల పరిరక్షణ అత్యంత ఆవశ్యమని పతంజలి పరిశోధకుడు ఆచార్య బాలకృష్ణ పేర్కొన్నారు. శనివారం పతంజలి రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌లో డిజిటల్ విద్యార్థులకు జిజ్ఞాస కార్యక్రమం నిర్వహించారు. టీఎస్ అండ్ హెచ్ఎండీ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ నిర్మల్‌కు మార్‌కళాకర్, అయుష్ మంత్రిత్వ శాఖ నెట్‌వర్క్ పీబీ మాజీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ సుశీల్‌కుమార్ ఉపాధ్యాయ పాల్గొని ఔషధ మొక్కల ప్రాధాన్యతను వివరించారు.

ప్రధాని పర్యటన.. నేడు, రేపు ట్రాఫిక్ ఆంక్షలు

సిటీబ్యూరో, మార్చి 16 (నమస్తే తెలంగాణ): ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన సందర్భంగా నగరంలో ఈనెల 17, 18తేదీల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు నగర ట్రాఫిక్ అదనపు కమిషనర్ తెలిపారు. ఆదివారం రాత్రి ప్రధాని బేగంపేట విమానాశ్రయానికి చేరుకొని, అక్కడి నుంచి రోడ్డు మార్గాన రాజ్‌భవన్‌కు చేరుకుంటారు. ఈ నేపథ్యంలో రసూల్‌పురా, పీఎన్‌టీ జంక్షన్, బేగంపేట్, గ్రీన్‌ల్యాండ్స్, మోనప్ప జంక్షన్, రాజ్‌భవన్ ఎంఎంటీఎస్ జంక్షన్, మెట్రో రెసిడెన్సీ లేన్, వీవీ స్టాచ్యూ జంక్షన్ మార్గాల్లో ఆదివారం రాత్రి 7.40గంటల నుంచి 8.10గంటల మధ్య ఎలాంటి ట్రాఫిక్‌ను అనుమతించరు. ప్రధాని బేగంపేట విమానాశ్రయానికి చేరుకోనుండడంతో పాటు వీఐపీ కదలికలు